ప్రమాదపుటంచున కల్వర్టులు

- భారీ వర్షాలకు దెబ్బతిన్న వైనం
- నెలలు గడుస్తున్నా మరమ్మతులకు దూరం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



సదాశివనగర్ శివారులో ధ్వంసమైన కల్వర్టు



ఉత్తనూర్ శివారులో ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మారిన కల్వర్టు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): భారీ వర్షాలకు రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. దీనికి తోడు రోడ్లకు ఇరువైపులా ఉన్న కల్వర్టులు సైతం కూలిపోయాయి. కొన్ని చోట్ల కల్వర్టుల మధ్య గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారినప్పటికి సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు ఉత్తునూర్, వజ్జపల్లి, తుక్కోజీవాడి, తిమ్మోజీవాడి గ్రామాల్లో దెబ్బతిన్న కల్వర్టులకు వెంటనే మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేదని పేర్కొంటున్నారు. ఈ రోడ్ల మీదుగా రాత్రి వేళలో ప్రయాణం చేయాలంటే భయంగా ఉంటుందని వారు చెబుతున్నారు. మరమ్మతుల కోసం ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేస్తున్నప్పటికి అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కల్వర్టుల వద్ద భారీ ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారేమోనని వారు అంటున్నారు. మండల కేంద్రం శివారులో రెన్యూ సోలార్ పవర్ ప్లాంట్‌కు వెళ్లే దారిలో కల్వర్టు భూమిలోకి కుంగిపోయింది. రోడ్డు ధ్వంసమైంది. ఆ రోడ్డు గుండా ప్రతి రోజు వందలాది రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ కుంగిన కల్వర్టుకు మాత్రం మరమ్మతులు చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పట్టించుకోవడం లేదు



గ్రామ శివారులోని ప్రధాన రోడ్డుపై గల కల్వర్టు పూర్తిగా ధ్వంసమైంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలిపాం. కానీ పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు గుండా రోజు వందలాది మంది వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైన అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. – వెంకట్ రావు, ఉత్తనూర్

వెంటనే మరమ్మతులు చేయాలి



వ్యవసాయ బావి వద్దకు ఈ రోడ్డు గుండా రోజుకు మూడు నాలుగు సార్లు తిరుగుతుంటాం. ఇటీవల కురిసిన వర్షాలకు కొత్తగా నిర్మించిన కల్వర్టు నీటి ఉధృతికి పూర్తిగా కుంగిపోయింది. దీంతో రోడ్డు గుంతగా మారిపోయింది. ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు దృష్టి సారించాలి.

– కుంట సాయిరెడ్డి, సదాశివనగర్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



పిట్లంలో మాట్లాడుతున్న ఎంపీవో బ్రహ్మం

పిట్లం(జుక్కల్): ప్రతి జీపీ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా చర్య లు చేపట్టాలని, బ్లీచింగ్ పౌడర్, లైమ్, ఫినాయిల్ తగు మోతాదులలో నిల్వ ఉంచుకోవాలని మండల పంచాయితీ అధికారి బ్రహ్మం పేర్కొన్నారు. ఆయన మండల పరిషత్ కార్యాలయంలో శనివా రం కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ.. పన్నుల వసూ లు, విద్యుత్ చార్జీల బకాయిల చెల్లింపు, పోలింగ్ స్టేషన్లో కనీస వసతులు ఏర్పాటు, తదితర విషయాలపై చర్చించి సూచనలు చేశారు.

ప్రతి రోజూ పారిశుధ్య పనులు నిర్వహించాలి

పిట్లం(జుక్కల్): పిట్లం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ జొన్న విజయారెడ్డి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పంచాయతీ పరిధిలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలని, నీటి సరఫరా, విద్యుత్ పనుల నిర్వహణ, పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానాలు చేశారు.

సమాచారం..

■ నేడు భిక్కనూరులో ప్రభుత్వ విప్ పర్యటన

భిక్కనూరు: ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆదివారం మండల కేంద్రంలో పర్యటించనున్నట్టు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ... మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

■ విద్యుత్ సరఫరాలో అంతరాయం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి కలెక్టరేట్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా ఆదివారం సబ్‌స్టేషన్ పరిధిలోని గుమస్తా కాలనీ, జయశంకర్ కాలనీ, ఇందిరానగర్, డ్రైవర్స్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు.

■ మెగా రక్తదాన శిబిరం

కామారెడ్డి అర్బన్: స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 వరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు రక్తదాతల సమూహం అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్ తెలిపారు. రక్తదాతల సమూహం 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

■ 3న ప్రజావేదిక కార్యక్రమం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అక్టోబర్ 3న ఉపాధి హామీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మి తెలిపారు. జూలై-1, 2021 నుంచి మార్చి 31, 2023 వరకు జరిగిన పనులకు చెల్లించిన డబ్బులకు సంబంధించి 14వ విడత సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా

పీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.2.2 కోట్లు మంజూరు

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో పీహెచ్‌సీ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం దేవునిపల్లిలో ఉన్న పీహెచ్‌సీ భవనాన్ని మెడికల్ కళాశాల డీఎంఈ స్వాధీనం చేసుకున్నారు. దీంతో నర్సన్నపల్లి గ్రామ శివారులో నూతన భవనాన్ని నిర్మించనున్నారు.

రైస్‌మిల్లు తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్‌లోని రైస్ మిల్లును శనివారం టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. రైస్ మిల్లు నుంచి సీఎంఆర్ బియ్యం సేకరణ వివరాలను తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏఎస్‌వో సుదర్శన్ రెడ్డి, సీఐ లక్ష్మయ్య, ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, తదితరులున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



గాంధారి(ఎల్లారెడ్డి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పట్టుకుని బాధితురాలికి శనివారం అప్పగించినట్లు ఎస్సై ప్రేమ్‌చంద్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన గుమ్మడి సావిత్రి తన సెల్‌ఫోన్ పోయిందని పీఎస్‌లో ఫిర్యాదు చేసిందని ఎస్సై చెప్పారు. ఆమె ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ యాప్ ద్వారా విచారణ చేసి పట్టుకుని అప్పగించినట్లు తెలిపారు.

దుస్తుల పంపిణీ



బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు మంజూరైన దుస్తులను శనివారం గ్రామ సర్పంచ్ నారాయణరెడ్డి పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు రాఘవేందర్, నాయకులు వసీయోద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీలు..



పిట్లం(జుక్కల్): బొల్లక్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ విఠల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివాజీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చలో కామారెడ్డి విజయవంతం చేయాలి

దోమకొండ: ఎలాంటి షరతులు లేకుండా బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న తలపెట్టిన చలో కామారెడ్డి కార్యక్రమం విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర బీడీ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వల్లాల చంద్రమౌళి అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడిని పింఛను అందించాలన్నారు. సంఘం రాష్ట్ర నాయకులు పెద్ది శివయ్య తదితరులున్నారు.

వీరభద్రేశ్వరాలయంలో రుద్రాభిషేకాలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్‌లోని వీరభద్రేశ్వరాలయంలో శుక్రవారం రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో 41 రోజుల పాటు నిత్యం భజన కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజున భక్తులకు భారీ ఎత్తున అన్నదానం చేశారు. తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. సర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మణ్, వార్డు సభ్యుడు మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజిరెడి పాల్గొన్నారు.

అంబులెన్సులోనే ప్రసవం

గాంధారి(ఎల్లారెడ్డి): 108 అంబులెన్సులో మహిళ ప్రసవించినట్లు ఈఎంటీ కమలాకర్, శనివారం తెలిపారు. వివరాలు.. గండివేట్ గ్రామానికి చెందిన నామాల బాలమణి పురిటి నొప్పులతో బాధపడుతుందని శనివారం తెల్లవారు జామున 108కు సమాచారం వచ్చింది. వెంటనే గ్రామానికి చేరుకుని గర్భిణీని బాన్సువాడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించినట్లు తెలిపారు. తల్లీ బిడ్డను బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు.

అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారు

- ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్

కామారెడ్డి క్రైం: తెలంగాణలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసం వద్ద బీబీపేట మండలం కోనాపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు లింగంతో పాటు గ్రామానికి చెందిన 65 కుటుంబాలు ప్రభుత్వ విప్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు వెంకటి గౌడ్ పాల్గొన్నారు.

'పనిచేయడంలోనే ఆత్మసంతృప్తి'



రమేష్ బాబు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

రామారెడ్డి (ఎల్లారెడ్డి): రామారెడ్డి మండలంలో పని చేయడం ఆత్మసంతృప్తినిచ్చిందని, తను ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సమయంలో పల్లె ప్రగతి పేరుతో ప్రభుత్వం నిర్వహించిన పనుల వల్ల గ్రామాలు బాగుపడ్డాయని రామారెడ్డి ఎంపీడీవో విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో విజయ్ కుమార్ పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎంపీడీవో విజయ్ కుమార్ దంపతులను సన్మానించారు. జెడ్పీ సీఈవో సాయా గౌడ్, రామారెడ్డి ఎంపీపీ దశరథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, ఎంపీటీసీలు ప్రవీణ్ గౌడ్, తుపాకుల రజిత తదితరులు పాల్గొన్నారు.

రమేష్ బాబు సేవలు మరువలేనివి

కామారెడ్డి క్రైం: సమాచార శాఖలో 31 ఏళ్ల పాటు పనిచేసి శనివారం పదవీ విరమణ పొందిన ఆఫీస్ సబార్డినేట్ మూర్తి రమేష్ బాబు సేవలు మరువలేనివని జిల్లా పౌర సంబంధాల అధికారి శాంతి కుమార్ అన్నారు. పదవీ విరమణ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో రమేష్ బాబు దంపతులను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యాలయ సిబ్బంది రమేష్ కుమార్, గణేష్, శ్రీనివాస్, గంగారాంపాల్గొన్నారు.

మాంసం విక్రయదారులకు ముందస్తు నోటీసులు



నోటీసులు అందజేస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్: మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న పట్టణంలో మటన్, చికెన్, చేపల విక్రయదారులు మాంసం విక్రయించవద్దని మున్సిపల్ అధికారులు శనివారం వ్యాపారులకు ముందస్తుగా నోటీసులను అందజేశారు. 2న మాంసం దుకాణాలను మూసి ఉంచాలని, మాంసం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ హెచ్చరించారు.

గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యం



పుల్కల్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

బిచ్కుంద(జుక్కల్): గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఎంపీపీ అశోక్ పటేల్, జెడ్పీటీసీ నాల్చర్ భారతి అన్నారు. శనివారం బండరెంజల్, గుండెనెమ్లి, పుల్కల్‌లో మన ఊరు-మన బడి పాఠశాలల నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. శెట్లూర్, మెక్కాలో జీపీ భవనం, సీసీ రోడ్లను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని, ఎమ్మెల్యే హన్మంత్ సింధే పూర్తి సహకారం ఉందన్నారు. సర్పంచ్‌లు బాల్‌రాజ్, కిష్టారెడ్డి, నవాజ్, భూమి శెట్టి, వైస్ ఎంపీపీ రాజు పటేల్, ఏఎంసీ చైర్మన్ నాగనాథ్, నాయకులు వెంకట్‌రావు, రాజు, రాంరెడ్డి పాల్గొన్నారు.

తరుగు తీయకుండా ధాన్యాన్ని కొనాలి



మాట్లాడుతున్న అంతంపల్లి విండో చైర్మన్ వెంకటరెడ్డి



అడ్లూర్‌ఎల్లారెడ్డిలో .. మర్రి సదాశివరెడ్డి

భిక్కనూరు: రైతులు పండించిన ధాన్యం తరుగు లేకుండా కొనుగోలు చేయాలని అంతంపల్లి సింగిల్ విండో మహాజనసభ తీర్మానించింది. శనివారం విండో చైర్మన్ వలకొండ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ రాజారెడ్డి, సర్పంచ్‌లు మధుమోహన్‌రెడ్డి, సుమలత, ఎంపీటీసీ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

విండోను అభివృద్ధి బాటలో నడిపించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సింగిల్ విండోను అభివృద్ధి బాటలో నడిపించాలని విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి అన్నారు. శుక్రవారం అడ్లూర్‌ఎల్లారెడ్డి సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో విండో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విండో సీఈవో భైరయ్య ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి, సీఈవో భైరయ్య, విండో వైస్ చైర్మన్ పశుపతి, సర్పంచ్‌లు పైడి జానకి, సంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలు సహకార సంఘాలలో మహాజన సభలు

పిట్లం(జుక్కల్): కారేగాం, రాంపూర్ సహకార సంఘాలలో శనివారం సహకార సంఘం చైర్మన్లు వెంకట్‌రాంరెడ్డి, శఫ్దంరెడ్డిల అధ్యక్షతన మహాజన సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం కార్యదర్శులు నర్సింహారెడ్డి, సంతోష్ రెడ్డిలు సహకార సంఘాలకు సంబంధించిన ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు.

రైతుల సహకారంతో సంఘం అభివృద్ధి

బిచ్కుంద(జుక్కల్): రైతుల సహకారంతో బిచ్కుంద సొసైటీ దిన దిన అభివృద్ధి సాధించిందని సంఘం చైర్మన్ బాలు శ్రీహరి అన్నారు. శనివారం 55వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. 334 మంది రైతులకు ప్రభుత్వం నుంచి రూ.20 కోట్ల రుణమాఫీ వచ్చిందన్నారు. వైస్ చైర్మన్ యాదవ రావు, సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.



చిన్నకొడప్‌గల్ సీఈవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డైరెక్టర్లు, రైతులు

సభ అర్ధంతరంగా ముగించారని ఆగ్రహం

పిట్లం(జుక్కల్): చిన్నకొడప్‌గల్ రైతు వేదికలో శనివారం సహకార సంఘం చైర్మన్ నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మహాజన సభలో అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వకుండా మహాజన సభను అర్ధంతరంగా ముగించారని పలు డైరెక్టర్లు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు సహకార సంఘం వద్ద విలేకర్లతో మాట్లాడారు. సహకార సంఘం డైరెక్టర్లు సాయిలు, నాగిరెడ్డి, కాంత్‌రెడ్డిలు మాట్లాడుతూ.. పురాతన సహకార సంఘం భవనాన్ని కూలగొట్టడానికి చేసిన తీర్మానం రాసి తమ సంతకాలు తీసుకున్నారు. తర్వాత అదే తీర్మానంలో తమకు సమాచారం ఇవ్వకుండా బోరు, మోటర్ కోసం రూ.89 వేలు ఖర్చయినట్లు తీర్మానం రాశారు. ఇలా తమకు సమాచారం ఇవ్వకుండా తీర్మానంలో ఎలా జత చేస్తారని కార్యదర్శి హన్మండ్లుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా శతాబ్ది ఉత్సవాలలో ఏం చేశారని రూ.లక్షా 11 వేలు ఖర్చు రాశారని ప్రశ్నించారు. ఎంపీటీసీ వెంకట్‌రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో మాక్ పోలింగ్



పోటీ చేస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కల్యాణి గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులకు ఓటింగ్‌పై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. దీని ద్వారా విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకోవడం, నాయకుడిని ఎన్నుకునే విధానం పట్ల వారికి అవగాహన కలుగుతుందన్నారు. ఉపాధ్యాయులు నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు తదితరులున్నారు.



ఓటు వేసేందుకు బారులు తీరిన విద్యార్థులు

'ప్రజా సేవ చేయాలనే రాజకీయాల్లోకి వచ్చా'



ఇళ్లను ప్రారంభిస్తున్న సతీష్ కుటుంబసభ్యులు

బాన్సువాడ: ప్రజలకు సేవల చేయాలని సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చానని బీర్కూర్ మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ అన్నారు. శనివారం బీర్కూర్ మండలం బైరాపూర్‌లో తన తండ్రి సీతారామయ్య జ్ఞాపకార్థం, తల్లి కస్తూరమ్మ పేరుపై గ్రామంలో ఉన్న ఒంటరి మహిళలకు సొంత నిధులతో నిర్మించిన ఏడు ఇళ్లను తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలని దృక్పథంలో 1995లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. కార్యక్రమంలో సతీష్ కుటుంబసభ్యులు కస్తూరమ్మ, ద్రోణవల్లి అశోక్, లక్ష్మీ, రమ్య, రేష్మా, సాయి శశాంక్, అప్పారావు, సర్పంచ్ అంజవ్వ, జెడ్పీటీసీ స్వరూప, ఎంపీపీ రఘు, తదితరులున్నారు.

స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకుందాం



భిక్కనూరు: స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవాలని కామారెడ్డి పోస్ట్‌ఆఫీస్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ అన్నారు. శనివారం భిక్కనూరు మండల కేంద్రంతో పాటు రామేశ్వర్‌పల్లిలో ఆజాదీ కా అమృత మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేరీ మాటి మేరీ దేశ్‌లో భాగంగా స్వాతంత్య్ర సమరయోధుల వారసులను కలిసి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. వారిని సన్మానించారు. వారసులతో మట్టిని సేకరించి ఢిల్లీకి పంపుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.

బోరు మోటార్ ప్రారంభం



దోమకొండ: మండల కేంద్రంలోని 10వ వార్డులో శనివారం బోరుమోటార్‌ను బిగించినట్లు జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ చెప్పారు. కాలనీలో నీటిసమస్య ఉందని కాలనీవాసులు ఆయన దృష్టికి రాగా, వెంటనే స్పందించి బోరుమోటార్ బిగించినట్లు వివరించారు. ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పొర్లు దండాలతో అంగన్‌వాడీల నిరసన



జిల్లా కేంద్రంలో పొర్లు దండాలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సాక్షి నెట్‌వర్క్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. శనివారం ఆయా మండలా పరిధిలో బతుకమ్మలు ఆడి, పొర్లుదండాలు పెడుతూ వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు కనీస వేతనం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. అంగన్‌వాడి సెంటర్‌లలో మెప్మా ఆర్పీలతో బలవంతంగా పనులు చేయించవద్దని సీఐటీయూ, అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని మెప్మా కార్యాలయాన్ని ముట్టడించారు.



నస్రుల్లాబాద్: మైసమ్మ ఆలయంలో..



నాగిరెడ్డిపేటలో ..



ఎల్లారెడ్డిలో బోనాలతో నిరసన ..



నిజాంసాగర్‌లో ..